క్లుప్తంగా...

నేటి నుంచి సాయిబాబా జయంతి మహోత్సవాలు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో బాలగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి సాయిబాబా జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నందికంటి రవి, జ్ఞానేశ్వర్, శేఖర్, సతీష్, చంద్రకుమార్ పేర్కొన్నారు. 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని 31వ తేదీన భజనలు, ఏప్రిల్ 1న మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



అడ్డగుట్ట: తార్నాక కిమ్టీ కాలనీలో ప్రఫుల్ల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

◆ ప్రొఫెసర్ బండి రామకృష్ణారెడ్డికి పద్మశ్రీ పురస్కారం వచ్చిన సందర్భంగా బుధవారం తార్నాకలోని ఆయన నివాసానికి వెళ్లిన డిప్యూటీ మేయర్ దంపతులు రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు.

డ్రైవర్ ప్రాణాలు కాపాడిన కండక్టర్



సామియేల్‌ను అభినందిస్తున్న అధికారులు

బన్సీలాల్‌పేట్: విధి నిర్వహణలో ఉన్న బస్సు డ్రైవర్‌కు ఛాతీనొప్పి రావడంతో సకాలంలో స్పందించి కండక్టర్ ప్రాణాలు కాపాడాడు. రాణిగంజ్ డిపోలో డ్రైవర్‌గా మహ్మద్ మోహినుద్దీన్, అదే బస్సులో కండక్టర్‌గా సామియేల్ విధుల్లో ఉన్నారు. సికింద్రాబాద్ నుంచి పటన్‌చెరు రూట్‌లో ఇరువురు బుధవారం విధుల్లో ఉన్నారు. ఇక్రిశాట్ సమీపంలోకి రాగానే మోహినుద్దీన్‌కు ఒక్కసారిగా ఛాతీ నొప్పి వచ్చింది. అప్రమత్తమైన సామియేల్ సకాలంలో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించాడు. డిపో మేనేజర్ లక్ష్మీధర్మ, అసిస్టెంట్ మేనేజర్ సరితాదేవి కండక్టర్ సామియేల్‌ను అభినందించారు.

డిజిటల్ యూనివర్సిటీ స్థాపన అనివార్యం

ఉస్మానియా యూనివర్సిటీ: భవిష్యత్‌లో రాష్ట్రంలోనూ డిజిటల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అవకాశాలు ఉందని ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. ఓయూ దూర విద్య కేంద్రం ఆడిటోరియంలో ఈఎంఎంఆర్‌సీ (ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ డిజిటల్ టెక్నాలజీస్ ఫర్ టీచింగ్ అండ్ లర్నింగ్ ఇన్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఎ మూక్స్ పర్‌స్పెక్టివ్) అనే అంశంపై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి హాజరైన లింబాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ వర్సిటీలలో మాస్టర్ డిగ్రీలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళలు 76 శాతం మంది పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందడం ఉన్నత విద్యలో గొప్ప మార్పునకు సంకేతమన్నారు. ఉన్నత విద్యలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య దృష్ట్యా రాష్ట్రంలోనూ డిజిటల్ యూనివర్సిటీ స్థాపన అనివార్యమన్నారు.

ఆర్మీ అధికారుల తీరుతో భక్తుల నిరసన

రసూల్‌పురా: తిరుమలగిరి లాల్‌బజార్ ఆర్మీ ప్రాంతంలో ఉన్న హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జరిపేందుకు ఆర్మీ అధికారులు అంగీకరించకపోవడంతో భక్తులు ఆందోళనకు దిగారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ ఆర్డీవో వసంత కుమారి వచ్చి ఆర్మీ అధికారులతో మాట్లాడినా సమస్య కొలిక్కి రాలేదు. పురాతన హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి రోజున కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. కరోనా సమయం నుంచి ఆలయానికి వెళ్లే మార్గాన్ని మూసివేశారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నా గేట్లను తెరవలేదు. గతేడాది ఎమ్మెల్యే సాయన్న, మర్రి రాజశేఖర్ రెడ్డి వెళ్లి బ్రిగేడియర్ దృష్టికి తీసుకెళ్లడంతో అంగీకరించినప్పటికీ నిబంధనలు విధిస్తూ ఆర్మీ అధికారులు అడ్డుకుంటుండడంతో భక్తులు ఆలయానికి వెళ్లడం మానేశారు. బుధవారం కల్యాణం ఏర్పాట్లు చేసేందుకు వెళ్లగా మళ్లీ అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మౌలాలి కార్పొరేటర్, బీజేవైఎం నాయకులు తరుణ్ కృష్ణమ నాయుడు, వెంకట చారీ, పవన్, కృష్ణ, వెంకటేష్, ప్రవీణ్ పరమేష్, బీఆర్ఎస్ నాయకులు సరిత, నీరజ్, సందీప్ ఆర్మీ అధికారులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఒప్పుకోకపోవడంతో విసిగిపోయిన భక్తులు వెనుదిరిగారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి!

- శ్రీరామ నవమికి ఆలయాలు సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వేడుకలకు సిద్ధమైన భక్తులు



విద్యుద్దీపాలతో ముస్తాబైన సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో వివిధ కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. సామూహికంగా భక్తులు సీతారాముల కల్యాణోత్సవాన్ని చూసి తరించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు భక్తులకు అన్నసంతర్పణ, పానకం, వడపప్పు ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపే సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.

◆ సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు దేవస్థానం ముందు గల రాంలీలా మైదానంలో ప్రత్యేక పందిళ్లు నిర్మించారు. భద్రాచలంలో మాదిరిగా ముత్యాల తలంబ్రాల సమర్పణ, అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేయనున్నారు. ప్రభుత్వం తరుపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వాటిని అందజేస్తారు.

◆ జెక్‌కాలనీలో శ్రీసీతారాముల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ మొదటి వీధిలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 7.20 గంటలకు ఒకటో వీధి నుంచి మూడో వీధి సన్‌రైజ్ పార్కు, అపార్ట్‌మెంట్‌కు మంగళసూత్రములు, తలంబ్రాలు తీసుకువస్తారు. ఉదయం 9 గంటలకు ఒకటో వీధిలోని సిల్వర్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ నుంచి భక్తులందరూ కలిసి దేవతావిగ్రహాలను తీసుకురానున్నారు. ఉదయం 10.10 గంటల నుంచి కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందని వివరించారు.



◆ బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లోని శ్రీభక్త హనుమాన్ శ్రీసాయిబాబా దేవస్థానం ఆధ్వర్యంలో నవమి ఉత్సవాలను ఘనంగా జరపనున్నారు. దేవస్థానం పుష్పాలంకృత కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

◆ బేగంపేట అల్లంతోటబావిలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

◆ సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ కాలనీలోని భగత్‌సింగ్ గ్రౌండ్‌లో శ్రీరామదాస ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, సుందర్‌నగర్‌లో సుందరభారతి కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో, మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీహాల్లో శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వీరహనుమాన్ దేవాలయంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని వీరహనుమాన్ దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామన్నారు. శ్రీరామ నవమి రోజు ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం ఎంతో వైభవంగా నిర్వహిస్తామని అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఓయూలో మరోసారి ఉద్రిక్తత



దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం అందిస్తున్న ప్రొ.శంకర్



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: పేపర్ లీకేజీపై సీబీఐతో న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ ముట్టడికి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకుని విద్యార్థులను అరెస్ట్ చేయడంలో ఓయూలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. బుధవారం ఓయూ విద్యార్థి జేఏసీ, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వర్సిటీ లైబ్రరీ నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి నినాదాలతో వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని ర్యాలీకి అనుమతి లేదని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టీఎస్‌పీఎస్సీని రద్దు చేసి, సిటింగ్ జడ్జి లేదా సీబీఐచే న్యాయవిచారణ జరిపించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, జంగిలి దర్శన్, వెంకన్నగౌడ్, సామాల అంబేడ్కర్, భాస్కర్, అంజి, సంతోష్, ఈశ్వర్‌లాల్, ఆనంద్, యూగేందర్, అర్షద్, సందీప్, ప్రవీణ్, సత్యం పాల్గొన్నారు.

మండుటెండలో దీక్ష..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని మండుటెండలో ఏబీవీపీ నాయకులు దీక్ష చేపట్టారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట రాష్ట్ర నాయకులు జీవన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను రాష్ట్ర, హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు కరుణాకర్, విష్ణువర్ధన్ విద్యార్థులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి, ఏబీవీపీ జాతీయ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఎల్లస్వామి, పగిడిపల్లి శ్రీహరి, తోట శ్రీను తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలకు మండుటెండలో కొనసాగిన దీక్షను ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఓయూ ప్రొ.శంకర్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షలో రాజు, కృతిక, కళ్యాణి, హరిప్రసాద్, అశోక్, శ్రీధర్, అల్లూరి ప్రశాంత్, సాయి, రేవంత్, వికాస్, త్రికోల్, ప్రణవ్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని ఏకేగౌడ్ ఫంక్షన్‌హాల్లో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్‌తో కలిసి పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఎలా ఉంది, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత పరిస్థితి ఎలా ఉంది అనేది కళ్లముందే కనిపిస్తుందని తెలిపారు. సనత్‌నగర్‌లో 60 ఏళ్లలో కాని అభివృద్ధి గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వేసవికాలం వచ్చిందంటే మంచి నీటి కోసం అనేక అవస్థలు పడేవారని, రాష్ట్రం ఏర్పడ్డాక నీటి కొరత లేకుండా పోయిందన్నారు. వెల్ఫేర్ గ్రౌండ్‌లో కార్మిక శాఖకు చెందిన స్థలాన్ని జీహెచ్ఎంసీకి బదలాయించి రూ.6.50 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు చెప్పారు. సుభాష్‌నగర్‌లో హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించి ప్రధాన సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ ప్రజల ఆదరణ పొందుతుంటే, దేవుళ్ల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, జెక్‌కాలనీ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తలసాని

అభివృద్ధి పనులు ప్రారంభం..

అమీర్‌పేట డివిజన్‌లో రూ.44.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. హరిజన బస్తీలో సీవరేజ్ పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. చిన్నగురుద్వారా వద్ద చెట్ల కొమ్మలు పెరిగాయని, వాటిని తొలగించాలని స్థానికులు మంత్రిని కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ సంకల్పమని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయనతో జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్రమని, అన్ని వర్గాలను కలుపుకుపోతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని, కార్యకర్తల శ్రమ, కృషిని మరువబోమన్నారు. ప్రతిపక్షలు కేవలం ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలకే పాకులాడుతున్నాయని విమర్శించారు. అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో పద్మారావుగౌడ్ కృషి ఆదర్శంగా ఉందని దాసోజు శ్రవణ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, నాయకులు లింగాని శ్రీనివాస్, కరాటే రాజు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పద్మారావుగౌడ్

పేద వర్గాలకు ప్రభుత్వం బాసట

పేద ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం మారేడుపల్లి మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 58 ప్రకారం మంజూరైన ఇళ్ల పట్టాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో 31 మంది లబ్ధిదారులకు కలెక్టర్ కార్యాలయం నుంచి మంజూరైన పట్టా పత్రాలు, క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రసన్నలక్ష్మి, సామల హేమ, కంది శైలజ, నేతలు కిషోర్‌గౌడ్, రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెయింట్ ఫ్రాన్సిస్‌లో జీ-20 సమ్మిట్‌పై సదస్సు

సనత్‌నగర్: బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ఐక్యూఏసీ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియల్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం జీ-20 సమ్మిట్‌పై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. 'హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ ఇట్స్ ఆస్పిరేషన్స్ ఇన్ బిల్డింగ్' వసుధైక కుటుంబం-వన్ఎర్త్, వన్ ఫ్యామిలీ-వన్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు 170 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సులో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రవీందర్ మాట్లాడుతూ.. జీ-20 ఆలోచనపై యువతకు అవగాహన కల్పించే దిశగా వారిని తమ అభిప్రాయాలను వెల్లడించే విషయంలో భాగస్వాములను చేయాలని విద్యా సంస్థలకు సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు సంబంధించి పరిష్కారాలను కనుగొనే దిశగా యువతకు తగిన భావస్వేచ్ఛ కల్పించే వేదికల ఏర్పాటు జరగాల్సిన అవసరం ఉందన్నారు. గురుస్వామి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ విద్యావర్ధిని, సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంద్రి హోటా పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


రసూల్‌పురా: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణ దాస్ హెచ్చరించారు. ఐదవ వార్డు విక్రమ్‌పురి కాలనీ డీ-12లో బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెండవ అంతస్తును సీఈవో మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు బుధవారం కూల్చివేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

రసూల్‌పురా: ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి బీజేపీ ఎస్సీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయమై చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న మాదిగల సంగ్రామ యాత్ర బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్‌కు చేరుకుంది. ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ కిషన్ మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు అజిత్ కళ్యాణ్ నేతృత్వంలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. మార్చి 31న కలెక్టరేట్ల ముందు, ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట మహాధర్నాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు మహాధర్నా విజయవంతం చేసేందుకు ఈ యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో మాదిగ విద్యార్థులు విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. వర్గీకరణ చేయకుండా బీజేపీ నాయకులు తమ ప్రాంతాల్లోకి వస్తే తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ యాత్రలో రాకేష్ , రజిని, అనిత, జ్యోతి, పుల్లన్న, నాగరాజు, రాజు, సుందర్, సాయి పాల్గొన్నారు.

గణపతి దేవాలయంలో అర్చకుడి సస్పెన్షన్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో వెండి ఆభరణాలు మాయమయ్యాయని సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నెల 29వ తేదీన సాక్షిలో 'దేవుడికే శఠగోపం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. ఆగమేఘాల మీద ఇదే ఆలయ ప్రాంగణంలోని హనుమాన్ గుడిలో అర్చకుడిగా పనిచేసే మురళి కృష్ణను ఈవో వినోద్ బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆభరణాలు చూపించలేదని ఈ నెల 15వ తేదీన ఈవో అర్చకుడికి మెమో జారీ చేయగా నేటి వరకు ఎలాంటి సంజాయిషీ ఇవ్వలేదు. బుధవారం సాక్షిలో కథనం రావడంతో ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారులు అర్చకుడిపై వేటు వేశారు. ఈ పాటికే గతంలో ఉన్న బరువు, ఆకారంలోనే ఆభరణాలు తయారు చేయిస్తున్నట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో గుట్టుచప్పుడు కాకుండా అదే స్థానంలో ఉంచి లాకర్‌ను తెరిచి చూపించాలని అధికారులు ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏది ఏమైనా ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సూర్య అన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రలో భాగంగా బుధవారం లాలాపేటలో నిర్వహించిన యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూనే ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా దేశ ప్రజల ఆదాయాలు దోచుకోవడం, సహజ సంపదను బడా బాబులకు కట్టబెట్టడం చేస్తోందని ఆరోపించారు. కేవలం మత విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం విలువలను కాపాడుకోవాలంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో సత్యం, శ్రీనివాస్, వెంకటేష్, రాజన్న, శ్రీనివాసరావు, అజయ్ బాబు, మారన్న, నరేష్, కిరణ్, జాన్, మహేందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వ్యక్తి అదృశ్యం



శ్రీధర్

చిలకలగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన శ్రీధర్ (36) ఉద్యోగ ప్రయత్నం కోసం బెంగుళూరు వెళ్లి ఈ నెల 27న ఇంటికి వచ్చాడు. కాసేపటి తర్వాత పని ఉందని తన ద్విచక్ర వాహనం పై బయటకు వెళ్లి ఎంతకీ ఇంటికి రాలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారితో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో బుధవారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం. 8, 9లోని ఎస్కలేటర్ పక్కన సుమారు 65 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు అతని వద్దకు వెళ్లి చూడగా చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

అడ్డగుట్ట: మారేడ్‌పల్లి మండల కార్యాలయం సమీపంలోని స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి శాస్త్రీనగర్‌లోని కమ్యూనిటీ హాల్ ప్రతిపాదిత స్థలాన్ని బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ వెంట గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీను, జీహెచ్ఎంసీ ఏఈ వేణు, సర్వేయర్ యమున, నేతలు ఇస్మాయిల్, గౌస్, దేవయ్య, రవి, గోపి, మల్లేష్ ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రసూల్‌పురా: మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకూ శిక్ష పడుతుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం మారేడ్‌పల్లి ట్రాఫిక్ సిబ్బంది సహకారంతో టివోలి రోడ్డు లోని బొల్టన్ స్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కూడళ్లలో సిగ్నల్ లైట్స్ జాగ్రత్తగా గమనిస్తూ జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డును దాటాలన్నారు. వాహనాలు నడిపే వారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుభాషిణి, వైస్ ప్రిన్సిపల్ గాయత్రి దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కక్ష సాధింపునకు పాల్పడుతున్న బీజేపీ'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో జైభారత్ సత్యాగ్రహ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో వేణుగోపాల్, చిరంజీవి, రమేష్, విఠల్, డాక్టర్ శివకుమార్ లాల్, లక్ష్మణ్, వేదప్రకాష్, సీపీ శంకర్, వినోద్, మహేష్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను బేఖాతరు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ రాజకీయ పార్టీ నాయకులు ప్రతిపక్ష నేతపై అనర్హత వేటు వేయడం దారుణమన్నారు. రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.